## క్లుప్తంగా

### ప్రజలను వంచించడమే..



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని, ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమని పరోక్షంగా మంత్రి అచ్చెన్నాయుడు అనడం శోచనీయం. ఇంత దగాకోరు ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకే ప్రజలు కూటమికి ఓట్లు వేశారు. అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ పథకాలను ఎగ్గొట్టేందుకు మంత్రి ఇటువంటి ప్రకటన చేయడం అన్యాయం. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి.

– కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

### ఇది వంచన కాదా..



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించింది. అధికారం చేపట్టి ఏడాదైనా ఈ పథకాల అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తే ఒకటి, రెండు పథకాలు అరకొరగా ఇస్తున్నారు. మిగిలిన పథకాలు ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాం. మంత్రి అచ్చెన్నాయుడు సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్రాన్ని అమ్మేయాలని అనడంతో మహిళల ఆశలు ఆవిరయ్యాయి. ఇది మహిళలను వంచన చేయడమే.

– అమర ఉష, కాగువాడ, పాతపట్నం మండలం

### కుండపోత



ఎల్.ఎన్.పేటలో కురుస్తున్న వర్షం

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. గత కొద్దిరోజులుగా ఎండలు అధికంగా ఉండటంతో వరి వెద పొలాలు ఎండిపోయాయి. గంట సమయం వర్షం పడడంతో వరి పొలాల్లో నీరు చేరింది. వెద పొలాలకు జీవం పోసినట్లు అయిందని మెట్ట ప్రాంత రైతులు చెబుతున్నారు.

### లింగాల రవిబాబు మృతికి పలువురి సంతాపం



లింగాల రవి (ఫైల్)

పాతపట్నం: మండల కేంద్రంలోని కాపు వీధికి చెందిన సామాజికవేత్త లింగాల రవిబాబు (54) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన తండ్రి జనార్దనరావు గతంలో సర్పంచ్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. రవికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రవి మృతి పట్ల పాతపట్నానికి చెందిన పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

### శాంతామణి అమ్మవారికి చల్లదనం



శాంతామణి అమ్మవారికి ముర్రాటులు పోస్తున్న భక్తులు

నరసన్నపేట: ఆషాఢ మాసం చివరి మంగళవారం సందర్భంగా స్థానిక శాంతామణి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుని ముర్రాటులు సమర్పించారు. భక్తులకు అమ్మవారు నిజరూపం దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పెద్దపేట వీధిలోని నీలమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. పైడితల్లి ఆలయ వద్ద భక్తుల సందడి కనిపించింది.



# తీరప్రాంతం ఆక్రమణ



పెద్దసవలాపురం సమీపంలో పొలంగా మార్చిన తీరప్రాంతం

- పశువులకు పచ్చిక బయళ్లు కరువు
- పొంచి ఉన్న వరద భయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

సరుబుజ్జిలి: వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాలను కొంతమంది ఆక్రమించి పొలాలుగా మారుస్తున్నారు. దీని వలన పశువుల మేతకు పచ్చికబయళ్లు కరువవుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 45 కిలో మీటర్ల పరిధిలో సుమారు 59 తీర ప్రాంతాలు గ్రామాలున్నాయి. ఈ తీర ప్రాంతాల్లో సుమారు 364 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి.

**వాణిజ్య పంటలు..**

తీరప్రాంత భూములను ఆక్రమించి అధికంగా వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. ముందుగా చిన్నపాటి గట్లు వేస్తారు. అనంతరం ఆ గట్లును పక్కాగా నిర్మించి పొలాలుగా తయారు చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో జీడి, మామిడి తోటలను పెంచుతున్నారు.



పెద్దమాలపేట వద్ద పొలాలుగా మారిన తీరం

**పశువుల మేతకు ఇబ్బంది..**

సరుబుజ్జిలి మండలంలోని పాతపాడు, తెలికిపెంట, అగ్రహారం, యరగాం, పెద్దమాలపేట, పెద్దసవలాపురం, పెద్దవెంకటాపురం తదితర తీర ప్రాంతాల బంజరు భూములను ముఖ్యంగా పశువులకు పచ్చికబయళ్లుగా వినియోగిస్తారు. ఈ పచ్చిక బయళ్లు నామరూపాల్లేకుండా చేయడంతో పశువుల మేతకు పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పొలాల్లో పంటలు ఉన్న సమయంలో తీర ప్రాంతాలనే పశువుల మేతకు వినియోగిస్తారు. సరుబుజ్జిలి మండలంలో 12 కిలో మీటర్ల పరిధిలోని తెలికిపెంట నుంచి అలమాజీపేట వరకు, బూర్జ మండలంలోని గుత్తావల్లి, లాభాం, నారాయణపురం, ఆమదాలవలస మండలంలోని కొత్తవలస, ఎన్.టి.వాడ, ఇస్కలపేట, తొగరాం, కలివరం, ముద్దాడపేట, పొందూరు మండలంలోని సింగూరు, బొడ్డేపల్లి తదితర గ్రామాల తీర ప్రాంతం ఎక్కువ శాతం ఆక్రమణల్లో ఉంది. దీంతో వర్షా కాలంలో పైనుంచి వచ్చిన వరదలు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆ సమయంలో పలు గ్రామాలు రోజుల తరబడి వరద నీటిలోనే ఉంటున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గంలో తీరప్రాతం ఆక్రమణల (ఎకరాల్లో) వివరాలు ఇలా..

| మండలం | సరుబుజ్జిలి | బూర్జ | ఆమదాలవలస | పొందూరు |
|---|---|---|---|---|
| తీరప్రాంత గ్రామాలు | 12 | 16 | 18 | 13 |
| ఆక్రమణ | 75 | 84 | 111 | 94 |

**తీరం కనుమరుగు**



తీర ప్రాంతం పక్కన ఉన్న భూములు వలన చాలా ప్రయోజనాలున్నాయి. కొంతమంది ఆయా భూములను ఆక్రమించి సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. తీర ప్రాంతాలను ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడం వలన పర్యావరణం పూర్తిగా పాడవుతుంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

**పశువులు అమ్ముకుంటున్నాం..**



నదీ తీర ప్రాంతాల ఆక్రమణల వలన విస్తీర్ణం తగ్గిపోతుంది. పొలాల్లో పంటలు ఉన్న సమయంలో పశువులను తీర ప్రాంతాలకు మాత్రమే తీసుకెళ్లాలి. తీరప్రాంతాలను పొలాలుగా మారుస్తున్నారు. దీని వలన పాడిపశువులు అమ్ముకోవాల్సి వస్తుంది.

– రావాడ రవికుమార్, యరగాం, సరుబుజ్జిలి మండలం

**పరిశీలన చేస్తాం..**

తీర ప్రాంతం ఆక్రమణ చట్టరీత్యా నేరం. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం. కాలువలు, తీర ప్రాంతాలకు పట్టాలు మంజూరు చేయడం జరగదు. ఇచ్చినా అవి చెల్లుబాటు కావు.

– ఎల్.మధుసూదన, తహసీల్దార్, సరుబుజ్జిలి

# బర్డ్ ఫ్లూపై అపోహలు వద్దు



పాతపట్నం చెక్ పోస్టును సందర్శించిన పశుసంవర్ధశాఖ ఏడీ కరుణాకరరావు

- సరిహద్దు చెక్ పోస్టుల్లో అప్రమత్తం చేశాం..
- పాతపట్నం పశుసంవర్ధశాఖ ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: బర్డ్ ఫ్లూ వ్యాధిపై అపోహలు వద్దని, కోడి మాంసం, గుడ్లు ఎప్పటిలాగే తినవచ్చని పాతపట్నం ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. పాతపట్నం సరిహద్దు చెక్ పోస్టును పశువైద్య బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మృతి చెందిన కోళ్లు ఒడిశా నుంచి రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పశుసంవర్ధశాఖ అప్రమత్తమైందన్నారు. సరిహద్దు చెక్ పోస్టులైన పాతపట్నం, వసుంధర వద్ద పశువైద్య సిబ్బందికి విధులను వేయడం జరిగిందన్నారు. ఒడిశా నుంచి కోళ్ల రవాణా కాకుండా చూడాలని పోలీసులు, పశువైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. పశువైద్యులు పి.అనిల్‌కుమార్, కె.మౌనిక, కిరణ్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### బోరు కబ్జా..!



బోరు చుట్టూ వేసిన కంచె

కొత్తూరు: మండలంలోని బమ్మిడి గ్రామంలో గల వైఎస్సార్ జగనన్న కాలనీలోని మిగులు భూమిలో తవ్విన తాగునీటి బోరు ఆక్రమణకు గురైంది. బోరు వద్దకు ఎవరూ వెళ్లకుండా చుట్టూ కంచె వేశారు. బోరు, స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులను కాలనీ వాసులు కోరుతున్నారు.

# విద్యార్థుల సంఖ్య తగ్గకూడదు

- డీఈఓ తిరుమల చైతన్య



కడుములో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని కడుము, బలద, మెట్టూరు పాఠశాలలు, ఎంఈఓ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పలు ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కడుములో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వంటలు మరింత రుచిగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీల్లోని ప్రీస్కూల్ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బలద జెడ్పీ ఉన్నత పాఠశాల (ప్రైవేట్ భవనం)లో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. పాఠశాలకు వసతి సమస్య ఉన్నందున భూమి కేటాయించిన వెంటనే పక్కా భవనం మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్ఎంలు తిరుమలరావు, డి.ఎల్.నరసింహం, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రమాణ స్వీకారం

హిరమండలం: హిరమండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ సభ్యులతో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. హిరమండలంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా గోళ్ల సింహాచలం, కమిటీ సభ్యులుగా కరణం శశిభూషణ్, గంగు మాధవరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మెళియాపుట్టి పీఏసీఎస్ చైర్మన్ సలాన మోహన్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, నాయకులు ఢిల్లేశ్వరరావు, ఎల్.తులసీవరప్రసాద్, అంధవరపు అబ్బాయి, పి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సూర్యం

### ఆక్రమణ పరిశీలన

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస సమీపంలో గల సైలాడ రెవెన్యూ పరిధి సంగమేశ్వరస్వామి ఆలయ వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణకు గురైనట్లు తహసీల్దార్‌కు చిట్టివలస గ్రామానికి చెందిన పలువురు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు మురళి, రీసర్వే డీటీ పప్పల గోవిందరావు, ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారుడు సీర సంజీవరావును ప్రభుత్వంలో మొక్కలు ఎందుకు వేశారని ప్రశ్నించారు. తన తల్లి సీర పోలమ్మకు డీపట్టాను గతంలో ఇచ్చారని ఆక్రమణదారుడు చెప్పడంతో.. డీ పట్టాను చూపించాలని అధికారులు ప్రశ్నించారు. కొన్నేళ్ల క్రితం ఇచ్చారని, ఇందులో ఎక్కడ ఇచ్చారన్నది చెప్పలేదని, ఇష్టం వచ్చినట్లు ఆక్రమణ చేసి మొక్కలు వేస్తే ఎలా అని అధికారులు ప్రశ్నించారు. సర్వేయర్లు ఎవరైనా హద్దులు చెప్పారా అని ఆక్రమణదారుడిని ప్రశ్నించగా.. చెప్పలేదని సమాధానం ఇచ్చాడు. తహసీల్దార్ కార్యాలయానికి అన్ని పత్రాలూ పట్టుకొని రావాలని చెప్పి అధికారులు వెళ్లిపోయారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

### మురుగునీటి సమస్యకు పరిష్కారం



మురుగు నీటి కాలువను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

హిరమండలం: ఎల్.ఎన్.పేట పరిధిలోని రోటరీ నగర్‌లో పారిశుద్ధ్య సమస్యకు సర్పంచ్ దివాకర్‌నాయుడు పరిష్కార మార్గం చూపారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో వచ్చే వరద నీటితోపాటు మురుగు నీరు చేరుతుంది. పంచాయతీలో నిధులు లేకపోవడంతో సర్పంచ్ సొంతంగా జేసీబీని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి సమస్య తీరడంతో రోటరీ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు లక్ష్మీనారాయణ, చంద్రినాయుడు, సుమన్, కృష్ణారావు పాల్గొన్నారు.

### క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేసుకోవాలి

హిరమండలం: విద్యార్థుల క్రీడా పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈఓ రాంబాబు సూచించారు. ఎమ్మార్సీలో వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ మొదటి వారంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అండర్ 14, అండర్ 17 స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆసక్తిగా ఉండే క్రీడల్లో ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ రమేష్, ఇతర పాఠశాలలకు సంబంధించి జ్యోతి, ధర్మారావు, ఎత్తిస్, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిష్టు ఉద్యమానికి తీరనిలోటు

ఆమదాలవలస: స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకుడు బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అచ్యుతానందన్ అత్యంత అరుదైన నేత అని, ఆయన మృతికి రెడ్ సెల్యూట్ అని పేర్కొన్నారు.

# కూటమి పాలన మోసాలమయం

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: తెలగవలసలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు జీవితమంతా మోసాలమయమని, ఆయన పేరు చెబితే మోసాలు, వెన్నుపోట్లు గుర్తుకువస్తాయని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని చెన్నాపురం, తెలగవలస, పారశెల్లి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చంద్రబాబును గెలిపించి ప్రజలు ఓడిపోయారని, ఇప్పుడు ఆయన మోసాలు తెలుసుకుంటున్నారన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, లుకలాపు రవి, యాబాజి రమేష్, రువ్వ వాసుదేవరావు, సురంగి నర్సింగరావు, బార్ల వేణుగోపాలరావు, బొబ్బాది ఈశ్వరరావు, పుట్ట ఆదిలక్ష్మి, బగ్గు రమణయ్య, కింతలి చలపతిరావు, ఆడంగి సూర్యనారాయణ, కొంక్యాన నర్సింహమూర్తి, కనపల శేఖరరావు, అంపోలు సుధ, బగ్గు సతీష్, పారశెల్లి అప్పన్న పాల్గొన్నారు.

**జలుమూరులో..**

జలుమూరు: సీఎం చంద్రబాబు పాలన అంతా మోసమేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం మర్రివలస, జెమినివలస, ఎస్టీమాకివలస, కరకవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారం కోసం నాడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, నేడు ఓట్ల కోసం ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ధర్మాన జగన్, బి.వి.రమణ, కె.హరిప్రసాద్, బగ్గు లక్ష్మణరావు, సీపాన మోహన్‌రావు, రాజప్పల నాయుడు, కరణం గణపతిరావు, బొమ్మాళి ప్రసాద్, పల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: మాకివలసలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

**సారవకోటలో..**



పెద్దలంబలో మహిళలకు క్యూఆర్ కోడ్‌లను అందజేస్తున్న నాయకులు

సారవకోట: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దలంబ, మహాలింగి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తోందో వివరించారు. క్యూఆర్ కోడ్‌లను అందజేశారు. సర్పంచ్‌లు ఇపై షణ్ముఖరావు, కొండాల బాబూరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, బొంగు కొండయ్య, పారశెల్లి తేజేశ్వరరావు, ధర్మాన రామకృష్ణ, తాడేల రామదాస్, తదితరులు పాల్గొన్నారు.

**పోలాకిలో..**

పోలాకి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని రహమానుపురం, బొద్దాం, కోడూరు పంచాయతీల్లో నిర్వహించారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగి నాయుడు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు ఆధ్వర్యంలో రేగుపాడు, కోడూరు, బొద్దాం గ్రామాల్లో కూటమి ప్రభుత్వ మోసాలపై క్యూఆర్ కోడ్ బ్రోచర్లతో ప్రచారం చేశారు. స్థానిక నాయకులు బెండి శ్రీనివాసరావు, సాలిన నగేష్ కుమార్, కూన గోవిందరావు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ యువజన విభాగం నాయకులు రెంటికోట త్రినాథరావు, చింతు రాఘవరావు, కణితి సత్తిబాబు, చింతు రామకృష్ణ, కె.లక్ష్మణరావు, చింతాడ ఉమామహేశ్వరరావు, పైల మల్లేషు, తదితరులు పాల్గొన్నారు.



రేగుపాడులో క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# వరి నాట్లు వేసేటప్పుడు చిగుర్లు తుంచాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఎల్.వి.మధు

సారవకోట: వరి నాట్లు వేసే సమయంలో ఆకు చిగుర్లు తుంచాలని వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీఏ ఎల్.వి.మధు సూచించారు. మంగళవారం మండలంలోని బుడితి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరి నాట్లు వేసుకునేటప్పుడు ఆకు చిగుర్లలో పంటలకు హాని చేసే పురుగులుంటాయని, వాటి వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. నాట్లు వేసే సమయంలో చిగుర్లు తుంచి నాట్లు వేసుకోవాలన్నారు. ఏఓ వెంకటరావు, ఎంపీటీసీ మురళి ఉన్నారు.